క్లుప్తంగా

'ఇందిరమ్మ' పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

జన్నారం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పారదర్శకత ఉండాలని ఎంపీడీవో ఉమర్‌షరీఫ్ అన్నారు. మండలంలోని కొత్తపేట, కామన్‌పల్లి గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. 8మంది లబ్ధిదారులకు రూ.1లక్ష చొప్పున వారి ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. అనంతరం నర్సరీలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీళ్లు పట్టాలని సూచించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో రవీందర్ తదితరులున్నారు.


వసతి గృహాల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: జిల్లాలో వెనుకబడిన తరగతుల ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న అడ్మిషన్ల కోసం 2025-26విద్యా సంవత్సరానికి గాను అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఏ.పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీమెట్రిక్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు జిల్లాలోని మంచిర్యాల, లక్సెట్టిపేట, జన్నారం, దండేపల్లి, జైపూర్, మందమర్రి, చెన్నూర్‌లలో ప్రభుత్వ వెనుకబడిన తరగతుల వసతి గృహాల్లో బీసీ(227), ఎస్సీ(63), ఎస్టీ(23), ఇతరులు(40) మొత్తం 353మందికి అడ్మిషన్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పోస్ట్ మెట్రిక్(కళాశాల వసతి గృహాలు)లో జిల్లాలోని మంచిర్యాల, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూర్, మందమర్రిలో ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల వసతి గృహాల్లో బీసీ(244), ఎస్సీ(117), ఎస్టీ(31), ఇతరులు(41)మొత్తం 433 మందికి అడ్మిషన్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో www.bchostels.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల ఎంపికకు...

మంచిర్యాలటౌన్: జిల్లాలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం గల ప్రైవేట్ పాఠశాలలు 2025-26 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల ఎంపిక కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన పాఠశాలల్లో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు 5వ తరగతి విద్యార్థులకు రూ.42వేలు ఉపకార వేతనం, ఉచిత భోజన వసతితో పాటు 2జతల దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ట్యూషన్ ఫీజు చెల్లించనున్నట్లు తెలిపారు. 1వ తరగతి(డే స్కాలర్)లో ఎంపికైన విద్యార్థులకు రూ.28వేల ఉపకార వేతనం, ట్యూషన్‌తో పాటు ఉచిత 2జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల నిమిత్తం చెల్లించనున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారములను ఈ నెల 21వ తేదీలోపు జిల్లాలోని కలెక్టరేట్ సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలోని షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందించాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు పాఠశాల అనుమతి ధృవీకరణ పత్రం, పాఠశాలలో సదుపాయాలు, భవనం ప్లాన్, అగ్నిమాపక భద్రత, గత 5 సంవత్సరాల ఉత్తీర్ణత శాతం, పాఠశాలలో నిర్వహించబడుతున్న కోర్సులు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను సమర్పించాలని తెలిపారు. అన్ని ప్రాథమిక సౌకర్యాలతో తగినంత మంచి నివాస వసతి ఉండాలని, ఆసక్తి, అర్హత గల ప్రైవేటు పాఠశాలలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులు రాణించాలి



విద్యార్థినులతో యశోధర, ఉపాధ్యాయులు

నస్పూర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జీసీడీఓ(గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్) యశోధర అన్నారు. పట్టణ పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమ్మర్ క్యాంపులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలియజేశారు. జిల్లాలోని 18కేజీబీవీల నుంచి సుమారు 170మంది విద్యార్థులు ఈ క్యాంపుల్లో పాల్గొన్నారన్నారు. క్యాంపులో విద్యార్థులు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, స్పీడ్ మ్యాథ్స్, పెయింటింగ్, సంగీతం, యోగా అంశాల్లో శిక్షణ పొందరాని తెలిపారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మౌనిక, ఉపాధ్యాయురాళ్లు బండ శాంకరి, స్వర్ణలత, దివ్య, హేమలత, తిరుమల, రజిత, భవాని, రోజా, శారద, కవిత, రోహిణి, కవిత తదితరులు పాల్గొన్నారు.



నా పేరు అరిగెల రాజవ్వ. మాది దండేపల్లి. 12ఎకరాల్లో పొలం వేశాను. 25రోజుల క్రితం దండేపల్లి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పగా పోశాను. ఇప్పటికీ ఇంకా కాంటా వేయలేదు. వర్షాలు వచ్చినప్పుడల్లా నానా పాట్లు పడుతున్నాం. దీంతో రోజూ కుప్పపై కవర్లు కప్పి కాపలా ఉంటున్నాం. ఇటీవల కురిసిన వానలకు అక్కడక్కడా కొద్దిగా ధాన్యం తడిసి మొలకలొచ్చింది. కాంటా వేయాలని బతిమాలినా పట్టించుకుంట లేరు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు..

ధాన్యం.. దైన్యం

- అకాల వర్షాలతో పడరాని పాట్లు..
- అమ్మకానికి అన్నదాతల అవస్థలు
- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు
- కలెక్టర్ చెప్పినా.. మారని నిర్వాహకుల తీరు

దండేపల్లి: వరిధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని, కొనుగోలు కేంద్రాల పరిశీలనకు వచ్చినప్పుడు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ పదే పదే చెబుతున్నారు... అయినా చాలా చోట్ల కొనుగోళ్ల తీరు ఇంకా అధ్వానంగానే ఉంది. దండేపల్లి మండల కేంద్రంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో 20 నుంచి 25రోజులకు పైగా రైతులు ధాన్యం కుప్పల వద్దనే ఉంటూ పడిగాపులు కాస్తున్నారు. ఓ వైపు వాతావరణ పరిస్థితులు రైతులకు ఆందోళన కలిగిస్తుండగా, ధాన్యం కాపాడుకోవడానికి అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. ధాన్యం ఎప్పుడు కాంటా వేస్తారు.. ఎప్పుడు మిల్లులకు తరలిపోతుందని ఎదురు చూస్తున్నారు. నిర్వాహకులను అడిగితే రేపు, మాపు అంటు సతాయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంటాల సంఖ్యను పెంచి, సరిపడా గన్నీ సంచులు అందుబాటులో ఉంచి కొనుగోళ్లు వేగవంతం చేసి ఇబ్బందులు లేకుండా చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మండలంలోని కొనుగోళ్ల తీరు ఇలా..

దండేపల్లి మండలంలోని 35వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2,648మంది రైతుల నుంచి 2,51,356క్వింటాళ్ల(6,28,390 బ్యాగులు) ధాన్యం కొనుగోలు చేశారు. 953 లారీల ద్వారా మిల్లులకు తరలించారు. అధికారుల ప్రాథమిక సమాచారం మేరకు ఇంకా సుమారుగా 110లారీల ధాన్యం వరకు మిల్లులకు తరలించే అవకాశం ఉంది. 60లారీల ధాన్యం కాంటా పూర్తయ్యింది. మిల్లులకు తరలించే ప్రక్రియ సాగుతుంది. ఇంకా 50లారీల ధాన్యం కాంటా వేయాల్సి ఉంది.

ఆలస్యానికి కారణాలు..

- సరిపడా గన్నీ సంచులు లేకపోవడం, వచ్చినా అరకొరగానే రావడం
- హమాలీల కొరత, కాంటాల సంఖ్య తక్కువగా ఉండటంతో ఎక్కడి కుప్పలు అక్కడే ఉంటున్నాయి.
- తూకం వేసిన బస్తాలు ఉదయం లారీల్లో లోడ్ చేస్తున్నారు. కాంటాలు వేయడంలో కొంత ఆలస్యం జరుగుతుంది.

20 రోజులు దాటింది..



ధాన్యం కుప్ప పోసి 20రోజులు దాటింది. అయినా ఇప్పటికీ కాంటా ఎయ్యలేదు. అడిగినప్పుడల్లా రేపు, మాపు అంటున్నారు. వానలు పడుతుండటంతో, కవర్లు కప్పి జాగ్రత్త పడుతున్నాం. పొద్దంతా ఆరబెట్టుడు, రాత్రి కుప్పజేసి కవరు కప్పుడు.. చాలా ఇబ్బంది అయితంది.

– చెన్నవేని సుధాకర్, రైతు

ఇబ్బంది లేకుండా చూస్తాం

దాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గన్నీ సంచులు, లారీల కొరత లేకుండా చూస్తున్నాం. కొంత హమాలీల కొరత ఉండటంతో ఆలస్యం అవుతోంది. వీలైతే హమాలీల సంఖ్య పెంచి కొనుగోళ్లు స్పీడప్ చేస్తాం. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం.

- బ్రహ్మయ్య, ఏపీఎం, దండేపల్లి

భక్తి శ్రద్ధలతో శ్రీరామ సహిత హనుమాన్ యజ్ఞం



అదనపు కలెక్టర్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు



యజ్ఞం నిర్వహిస్తున్న పూజారులు, భక్తులు

నస్పూర్: పట్టణ పరిధిలోని నస్పూర్ కాలనీ శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీరామ సహిత హనుమాన్ యజ్ఞాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ పాల్గొని ప్రతేక పూజలు చేశారు. అనంతరం దైవదర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అదనపు కలెక్టర్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మాలధారణ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లిలో హనుమాన్ నగర సంకీర్తన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వేంపల్లి శ్రీభక్తాంజనేయ సహిత శివకేశవ ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి హనుమాన్ నగర సంకీర్తన వేడుకలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయం నుంచి మొదలైన సంకీర్తన వేంపల్లి వీధుల్లో భజనా గీతాలు, నృత్యాలు, కోలాట ఆటలతో శోభాయాత్ర సాగింది. నగర సంకీర్తనకు స్థానిక మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

అరుదైన ఆపరేషన్ చేసిన పల్లవి ఆసుపత్రి వైద్యులు



పేషెంట్‌తో సర్జరీ చేసిన వైద్యుడు రాజు

మంచిర్యాలటౌన్: ఎడమకాలి తుంటి భాగంలో సమస్యతో బాధపడుతున్న రోగికి మంచిర్యాల పట్టణంలోని పల్లవి ఆసుపత్రి వైద్యులు అరుదైన రివిజన్ హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేశారు. ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు బొల్లబత్తిని రాజు మాట్లాడుతూ.. రామకృష్ణాపూర్‌కు చెందిన 42ఏళ్ల భాగ్యలక్ష్మికి ఎడమ కాలి తుంటి భాగంలో సమస్య కారణంగా గత 15ఏళ్ల క్రితం హిప్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ చేయించుకుంది. ఐదేళ్ల తరువాత మళ్లీ అదే భాగంలో సమస్య తలెత్తి ఇబ్బంది పడుతుండగా, జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో గల పల్లవి ఆసుపత్రికి వచ్చింది. ఈ సందర్భంగా ఆమెకు ఆపరేషన్ చేసిన భాగంలోనే మళ్లీ సమస్య తలెత్తిందని, తిరిగి సర్జరీ చేయడం ద్వారానే సమస్యకు పరిష్కారం లభిస్తుందని, హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లో, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేసే ఈ వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని తెలిపామన్నారు. దీంతో పల్లవి ఆసుపత్రిలోనే ఆపరేషన్ చేసుకుంటానని చెప్పడంతో, చాలెంజింగ్‌గా తీసుకొని ఆపరేషన్ చేయగా, నెల రోజుల్లోనే పూర్తిగా కోలుకుందన్నారు. తక్కువ ఖర్చులో మంచిర్యాలలోనే ఇలాంటి వైద్యాన్ని తాము అందిస్తున్నామని, ఇలాంటి ఆపరేషన్లు చేసుకున్న వారిలో రివిజన్, రీరివిజన్ సర్జరీలు అవుతుంటాయని, వైద్యుల సూచనలు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి పిల్లల వైద్య నిపుణురాలు సాయిశృజ, నిర్వాహకుడు నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



ఇసుక రీచ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

నస్పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. పట్టణ పరిధిలోని తాళపల్లి గోదావరి నది వద్ద ఇసుక రీచ్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆధ్వర్యంలోని పలు అభివృద్ధి పనులకు ఇసుక అందుబాటులో ఉండాలని, అదే విధంగా ప్రజల అవసరాలకు సైతం ఇసుక అందుబాటులో ఉండాలని ఇసుక రీచ్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సురమిల్ల వేణు, కార్పొరేషన్ కమిషనర్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణ పరిధిలోని సంజీవయ్య కాలనీలో ఎయిర్‌టెల్ కంపెనీ కేబుల్ వేస్తున్న క్రమంలో తాగునీటి పైప్ పగిలిపోయిందని, దానిని మరమ్మతు చేస్తున్న సందర్భంగా ఈ నెల 18న ఆదివారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

రక్తపోటుపై అవగాహన



మంచిర్యాలటౌన్: అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మంచిర్యాలటౌన్/మందమర్రిరూరల్/బెల్లంపల్లి: ప్రజలు రక్తపోటుపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అప్పాల ప్రసాద్ అన్నారు. రోజువారీగా తీసుకునే ఆహారపు అలవాట్లను కట్టడి చేయడం వల్ల రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవచ్చని బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి డెప్యూటీ సీఎంఓ డాక్టర్ ఎం.మధుకుమార్ అన్నారు. ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల అర్బన్ హెల్త్ సెంటర్‌లో, మందమర్రి కళ్యాణిఖని గని డిస్పెన్సరీ ఆవరణలో, బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో రక్తపోటుపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. అసంక్రమణ వ్యాధుల నివారణలో భాగంగా రక్తపోటుపై అవగాహన కార్యక్రమాలను నెల రోజుల పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో డాక్టర్ శివప్రతాప్, డాక్టర్ అమన్, అల్లాడి శ్రీనివాస్, లింగారెడ్డి, నరసింహస్వామి, ప్రశాంత్, మూర్తి, డెమో బుక్క వెంకటేశ్వర్, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొనగా, కళ్యాణిఖని గని డిస్పెన్సరీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వర్‌రావు, జీఎం సీసీ మేనేజర్ గుండేటి శంకర్, డిస్పెన్సరీ ఆఫీస్ సూపరింటెండెంట్ హెచ్.రవీందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు రమేశ్, వైద్య సిబ్బంది, బెల్లంపల్లిలో ఏఐటీయూసీ ఏరియా ఆసుపత్రి శ్రేణులు డీఆర్.శ్రీధర్, ఫిట్ సెక్రెటరీ అన్వేష్, ఏరియా ఆసుపత్రి మ్యాట్రన్, కమిటీ సభ్యులు, ఇతర సంఘాల శ్రేణులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు ఏరియా సమీపంలో గల శ్రీపంచముఖి ఆంజనేయస్వామి దేవాలయ రజతోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక వేంకటేశ్వర దేవాలయం నుంచి కోల్‌బెల్ట్ రహదారి మీదుగా వేలాది మంది భక్తులతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. మహిళల కోలాటం, ఒగ్గు కళాకారుల ప్రదర్శన, బాణాసంచా పేలుళ్లు, హనుమాన్ మాలాధారణ భక్తుల కోలాహలం ఆకట్టుకుంది. దేవనాథ రామానుజ జీయర్ స్వామి ప్రారంభించగా, అర్చకులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, కృష్ణకాంతాచార్యులు, వేద పండితులు స్వాగతం పలికారు.

మంత్రి శ్రీధర్‌బాబుపై కేసు నమోదు చేయాలి



నిరసన తెలుపుతున్న ఐక్యవేదిక నాయకులు

బెల్లంపల్లి: సరస్వతీ పుష్కరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫొటో లేకుండా అవమానించిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బెల్లంపల్లి దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ప్రచారం చేస్తుండగా మంత్రి శ్రీధర్‌బాబు మనువాదాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రోటోకాల్ పాటించకుండా అవమానపర్చడం సరికాదన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కుంబాల రాజేష్, చిలుక రాజనర్సు, దుర్గం గోపాల్, రత్నం ఐలయ్య, రాజ్‌కుమార్, కుశ్నపల్లి రాజలింగు, బందెల మురళి, రాజం, గద్దల కుమార్, శేఖర్, గజ్జెల రాంనాథ్, సతీష్, కృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై చర్యలు తీసుకోవాలని నిరసన


జైపూర్: దళిత ఎంపీ వంశీకృష్ణను అవమానపర్చిన మంత్రి శ్రీధర్‌బాబుపై అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మాలసంఘం చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు శీలం వెంకటేశ్ డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ప్లకార్డులతో దళిత సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి తహసీల్దార్‌గా నియామకమైన ఎల్.కృష్ణ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న యు.జ్యోత్స్న తాండూర్ మండలానికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి(డీఏవో)గా పని చేస్తున్న కృష్ణను బెల్లంపల్లి మండల తహసీల్దార్‌గా నియమించారు. తహసీల్దార్ కార్యాలయం అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వేమనపల్లి: వేమనపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఆలం పోచన్న ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రమేశ్ పెద్దపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు.

మహిళా సాధికారతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న లిప్సిక

మంచిర్యాలటౌన్: జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాతమంచిర్యాల జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో శనివారం మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత హబ్ ఆర్థిక అక్షరాస్యత నిపుణులు లిప్సిక బేటీ పడావో-బేటీ బచావో పథకం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ నంబర్ 14567, సైబర్ క్రైమ్ 1930, నేషనల్ ఎమర్జెన్సీ 112 వంటి హెల్ప్‌లైన్ నంబర్ల ఉపయోగాన్ని వివరించారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



బెజ్జాలలో రైతులతో మాట్లాడుతున్న పీడీ కిషన్

జైపూర్: రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఆర్‌డీవో కిషన్ తెలిపారు. మండలంలోని గంగిపల్లి, షెట్‌పల్లి, బెజ్జాలలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని జ్యాపం చేయకుండా కొనుగోలు చేయాలని, ధాన్యం లారీలను కరీంగనర్ తరలించాలని, అక్కడ ఎలాంటి ఆలస్యం కాకుండా అన్‌లోడ్ అవుతున్నాయని తెలిపారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీఎం రాజ్‌కుమార్, సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రతీ రైతు గుర్తింపు కార్డు పొందాలి

నెన్నెల: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రైతు ఐడీ కార్యక్రమం ద్వారా ప్రతీ రైతు గుర్తింపు కార్డు పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సృజన అన్నారు. మండల కేంద్రంలోని రైతులకు శనివారం అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే పలు పథకాల లబ్ధిని పొందడానికి గుర్తింపు కార్డు తప్పనిసరి అన్నారు. ఈ కార్డు ద్వారా రైతు వివరాలు, భూమి రికార్డులు కేంద్ర ప్రభుత్వానికి అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు లింకు ఉన్న ఫోన్ నంబర్లను ఏఈవోల వద్ద ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు.

నెలాఖరులోపు కుట్టు పనులు పూర్తిచేయాలి

దండేపల్లి: స్కూల్ యూనిఫాం కుట్టుపని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంఈవో చిన్నయ్య అన్నారు. దండేపల్లి మండలంలోని మామిడిపల్లిలో స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్ సెంటర్‌ను శనివారం సందర్శించారు. కుట్టు పని ఎక్కడిదాక వచ్చాయి. తీసుకున్న వరకు కుట్టుడు త్వరగా పూర్తిచేయాలన్నారు. సీఆర్పీ నర్సయ్య ఉన్నారు.

అక్రమంగా నిర్మించిన గోడ కూల్చివేయాలి

జన్నారం: మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌కు వెళ్లే దారిలో అక్రమంగా నిర్మించిన అడ్డు గోడను తొలగించాలని కోరుతూ శనివారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజా మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వీరికి పలువురు కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. అంబేద్కర్ సంఘం నాయకులు రమేశ్, కరుణాకర్, ప్రవీణ్, ప్రభాకర్, మహేశ్, నరేశ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ తదితరులున్నారు.

అమరవాది చెరువులో పూడిక తీయాలి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అమరవాది చెరువులో పూడికతీత పనులు చేపట్టాలని మాజీ జెడ్పీటీసీ యాకూబ్‌అలీ, మత్స్యకారులు శనివారం మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందించారు. చెరువు సమీపంలో ఉన్న ఓపెన్‌కాస్ట్ గని మట్టి, చెరువులోకి కొట్టుకొచ్చి చెరువు అంతా మట్టితో నిండిందని, నీరు నిలువక చెరువు ఎండిపోయిందని పేర్కొన్నారు. చెరువులో చేపల పెంపకం చేపడుతూ సుమారు వంద కుటుంబాలు జీవిస్తున్నాయని, వెంటనే పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకారులు గట్టయ్య, నూనె శ్రీనివాస్, వెంకటస్వామి పాల్గొన్నారు.

నేడు అగ్రిడ్రోన్స్‌పై అవగాహన

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లి అంబేడ్కర్ మైదానంలో అగ్రిడ్రోన్స్‌పై ఉదయం 8గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు చింతల వంశీకృష్ణ తెలిపారు. మండలంలోని నిరుద్యోగ యువత, యువ రైతులకు అగ్రిడ్రోన్స్‌పై గగన్ డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారితో నిర్వహించే సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ రంగంలో మార్పులు, నూతన టెక్నాలజీ ద్వారా మరింత సులభమైన వ్యవసాయానికి అవకాశాలు ఉన్నాయన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల కార్యవర్గం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండల గ్రామ పంచాయతీ కార్మికులు, కారోబార్‌ల నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం సమీపంలో నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండగొర్ల శ్రీనివాస అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రత్నం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా నస్పూరి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా దుగుట మల్లేష్, కోశాధికారిగా దోలే మల్లికార్జున్, కార్యదర్శిగా మంతెన శ్రీనివాస్ ఎన్నిక కాగా, మరో 12మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

రామకృష్ణాపూర్: పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు కేశిరెడ్డి కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా అతడి కుటుంబానికి ఎస్బీఐ ఆర్కేపీ బ్రాంచ్ శనివారం కోటి రూపాయల బీమా చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. బ్రాంచ్‌కు, సింగరేణి సంస్థకు ఉన్నటువంటి ఒప్పంద రీత్యా బీమా వర్తించినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్బీఐ మంచిర్యాల రీజనల్ మేనేజర్ రిషికుమార్, స్థానిక బ్రాంచ్ మేనేజర్ గోపాల్, సిబ్బంది ఉన్నారు.